నేరం దాగదు

ఓ శీతాకాలం. తెల్లవారుతున్న సమయం. బ్లూ హెవెన్ అపార్ట్‌మెంట్ ముందు ఆటో వచ్చి ఆగింది. నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ నించి నాంపల్లిలో దిగి యింటికి వచ్చిన సుధాకరమూర్తి మూడో అంతస్థు వెళ్లి 302 ముందు ఆగి జేబులోంచి తాళాలు తీసి తాళం తీయబోతూ డోరు కాస్త తెరిచినట్టుండడం చూసి ఆశ్చర్యపడ్తూ లోపలికెళ్లాడు. వెళ్ళిన ఒక నిమిషంలో గావుకేకలు పెడ్తూ బయటికి పరిగెత్తి వచ్చాడు. ఎదురింటి, పక్కింటి తలుపులు బాదుతూ వాచ్‌మెన్ వాచ్‌మెన్ అంటూ అరుస్తూ నిలువెల్లా వణికిపోతూ, నోట మాట రానట్టు అలా కూలబడి పోయాడు. పక్కింటి, ఎదురింటి ఫ్లాట్ తలుపులు తెరుచుకుని, కిందనించి, పైనుంచి జనాలు పరుగెత్తి వచ్చారు. వాచ్‌మెన్ కింద నించి పరిగెత్తి వచ్చాడు.

ఎదురింటి సుబ్రహ్మణ్యం "ఏం జరిగింది ఏం జరిగింది" అన్నాడు గాభరాగా.

సుధాకర్ లోపలికి చూపిస్తూ "హత్య హత్య" అన్నాడు వణికిపోతూ.

పక్కింటి ప్రదీప్ అతన్ని పట్టుకుని "... వాట్ హేపెన్డ్."

"సరోజ .. సరోజని ఎవరో ..." అంటూ లోపలికి పరిగెట్టాడు. అందరూ లోపలికి జొరపడ్డారు.

అక్కడ మంచం కింద సరోజ రక్తపు మడుగులో పడి ఉంది. లెమన్ కలర్ నైట్‌గౌన్‌లో ఉన్న ఆమె ఛాతిమధ్య కత్తి దిగబడి వుంది. గౌను అంతా రక్తం. దుప్పటి సగం కిందకి జారింది. దుప్పటినిండా రక్తం మరకలు.

"ఓమైగాడ్... హత్య... ఎవరు చంపారు. ఎప్పుడు ఎలా... మాకెవరికీ తెలియనే లేదు" – అంతా తలో మాట అన్నారు.

పై ఫ్లోర్లో వుండే ఓ డాక్టరు ముందుకు వచ్చి చేయిపట్టి నాడి చూసి, కనురెప్పలు తెరిచి చూసి, "చనిపోయి చాలా సేపయింది. హత్య రాత్రి ఎప్పుడో జరిగివుండచ్చు" కాళ్లు చేతులు కదుపుతూ ఎముకల కదలిక చూస్తూ అన్నాడు.

వాచ్‌మెన్‌ని అందరూ తలో ప్రశ్న వేశారు. రాత్రి ఎవరన్నా కొత్తవాళ్ళు వచ్చారా. ఏదన్నా చప్పుడు అది వినిపించిందా. ఎవరో వచ్చి ఇంత డేరింగ్‌గా హత్యచేసి వెళ్లారంటే ఈ వాచ్‌మెన్ యూస్‌లెస్ - అంతా తలోమాట అన్నారు. వాచ్‌మెన్ బెదిరిపోయాడు. "బాబూ, నేనసలు గేటు నిండి కదలనేలేదండి. రాత్రి నీళ్ల టాంకరు వచ్చినపుడు తప్ప గేటు నించి కదలనే లేదండి" - భయపడ్తూ చెప్పాడు.

సుధాకర్ కుర్చీలో కూలబడిపోయి రోదించసాగాడు. ప్రదీప్ అతని భుజం తడ్తూ ఓదారుస్తూ "సుధాకర్‌గారూ, మీరెక్కడనించి వస్తున్నారు. నిన్న ఊర్లో లేరా" - పక్కన సూట్‌కేస్ చూస్తూ అడిగాడు.

సుధాకర్ జేబురుమాలుతో కళ్లు తుడుచుకుంటూ, ఏడుపు ఆపుకుంటూ, "నేను మొన్న రాత్రి విజయవాడ వెళ్లి ఇప్పుడే వస్తున్నానండి, నేను వుండి వుంటే ఇలా ఎందుకు జరిగేదండి. నేను లేనని తెలిసి ఎవరో ఇలా..."

"నగలు, డబ్బూ, వస్తువులు ఏమన్నా పోయాయా చూడండి ముందు..." సుబ్రహ్మణ్యం అన్నాడు.

సుధాకర్ అపుడే గుర్తుతెచ్చుకుని భార్య వంక చూసి, "మెడలో సూత్రాల గొలుసు, గాజులు వుండాలి లేవు" అంటూ చుట్టూ చూసి బీరువాకి తాళాలు వ్రేలాడుతుండడం చూసి లేచి తలుపు తీయబోయాడు.

"ఆగండి, వద్దు, పోలీసులు రానీండి, ఫింగర్ ప్రింటులు అవి వుంటే చెదిరిపోతాయి" అన్నారెవరో, తమకున్న డిటెక్టివ్ నవలల, సినిమాల పరిజ్ఞానంతో.

సుధాకర్ ఆగిపోయాడు చుట్టూ చూశాడు - టి.వి., వి.సి.ఆర్. అవి అలాగే వున్నాయి. బీరువాలో రెండు మూడువేలు డబ్బు, సరోజవి ఇంకా కొన్ని నగలు ఉండాలి మరి! వీటి కోసమే ప్రాణాలు తీస్తారా ఎవరన్నా? మళ్ళీ అతని కళ్ళు నిండుకున్నాయి. అసలు లోపలికెలా వచ్చారు. ఆవిడ తలుపు బెల్ కొడితే తీసారా... ఇది ఎవరన్నా తెలిసినవాళ్ల పనా - లేక కేవలం డబ్బు కోసం జరిగిన పనా, ఎవరో అన్నారు. అందరి మనసులో లక్ష సందేహాలు. సుధాకర్ అయోమయంగా తలూపాడు.

"ఆవిడదగ్గర ఓ తాళం, నా దగ్గిర ఓ తాళం ఉంటాయి. ఎవరంతట వాళ్లు

ఇంటికి వచ్చినపుడు తాళం తీసుకునే వస్తాం. అందుకే నేను ఏ రాత్రి వచ్చినా, ఇలా ఉదయం వచ్చినా సరోజని డిస్టర్బ్ చేయకూడదని ఎవరి కీస్ వాళ్ళం పర్సులో వుంచుకుంటాం. ఏ తలుపు కిటికీ, వెంటిలేటర్లు తీసినట్టు లేదు" అన్నాడు చుట్టూచూసి.

"బహుశా ఎవరన్నా బెల్ కొడితే ఈవిడ తలుపు తీస్తే లోపల జొరపడ్డారేమో" - అన్నారెవరో.

"ముందు పోలీసులకి ఫోను చెయ్యండి. ఎవరూ ఏం ముట్టుకోకుండా డ్రాయింగు రూములోకి పదండి. ఊరుకోండి సుధాకర్. ఇంక ఎంత ఏడ్చినా ఏం లాభం? గుండె దిటవు చేసుకోండి" - ఏడుస్తున్న సుధాకర్ భుజం చుట్టూ చెయ్యి వేసి ముందు గదిలోకి నడిపించాడు ప్రదీప్."

"లావణ్యా కాస్త కాఫీగాని టీగాని చేసి పట్రా..." అన్నాడు భార్యతో.

"నాకేం వద్దండి... నాకేం వద్దు..." ఏడుస్తూ చేతిలో మొహం దాచుకున్నాడు సుధాకర్. అంతా జాలిగా చూసారు. సుధాకర్, సరోజల పెళ్లయి పట్టుమని ఏడాది మీద రెండు నెలలయింది. సరోజ కూడా ఉద్యోగస్తురాలే. భర్త మెడికల్ రిప్రెజెంటేటివ్. భార్య ఏదో కంపెనీలో పని. ఇద్దరూ బయటికి తొమ్మిది గంటలకల్లా వెడతారు. సరోజ ఏడులోపల సాధారణంగా ఇంటికి వస్తుంది. సుధాకర్ రాకపోకలకి టైముండదు. నెలకి 10, 15 రోజులు బయటి ఊర్లకి తిరుగుతాడు. హలో అంటే హలో పలకరింపులు, ఏదన్నా బిల్డింగు మీటింగు జరిగితే ఒకటి రెండుసార్లు కలవడం న్యూ ఇయర్ పార్టీ అపుడు ఏడాదికి ఓసారి బిల్డింగులో అంతా కలవడం తప్ప వాళ్ళిద్దరికి ప్రత్యేకం ఎవరితో పరిచయంలేదు లేదు పెద్దగా. ఆ ఫ్లోర్‌లో ఎదురుగా ఉన్న సుబ్రహ్మణ్యం, ప్రదీప్ భార్యలతో కాస్త పరిచయం. చాకలి బట్టలు తెచ్చినా, ఏదన్నా రిజిస్టర్, కొరియర్ లాంటివి వస్తే తీసి వుంచుతారు. అంచేత భార్యాభర్తల విషయాలు పెద్దగా ఎవరికీ తెలియవు.

ఫోను చేసిన అరగంటకి ఓ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక ఫోటో గ్రాఫర్, వేలిముద్రల నిపుణుడు వచ్చారు. అలవాటుగా ముందు ఫోటోగ్రాఫరు శవాన్ని అన్ని కోణాల నుండి ఫోటోలు తీసాడు. "హత్య జరిగినట్టు ముందెవరు చూశారు? ఈమె ఎవరి తాలూకు?" అనడిగాడు. సుధాకర్ ముందువచ్చి, "నా భార్య సరోజ ఆమె - నేనే ఉదయం ఊరి నుండి రాగానే తలుపు తీసేసరికి ఇలా శవమై"

దగ్గుత్తికతో అన్నాడు. ఇన్‌స్పెక్టరు సుధాకర్ మొహాన్ని పరీక్షిస్తూ, "ఉదయం రాగానే అన్నారు, మీరెక్కడికెళ్లారు - రాత్రి ఇంట్లో లేరా ..." అనుమానంగా చూశాడు.

"మొన్న రాత్రి విజయవాడ పనిమీద వెళ్లి ఇప్పుడే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చానండి."

ఇన్‌స్పెక్టర్ శవం వంక నిశితంగా చూసి, "వంటిమీద నగలు ఏమి లేవా... ఇంట్లో సామాన్లు అవి అన్నీ సరిగ్గా ఉన్నాయా..."

"వంటిమీద చేతికి రెండుజతల గాజులు, మెడలో సూత్రం తాడు, చేతికి ఉంగరం ఉండాలి. లేవు. బీరువాలో ఇంక డబ్బు, కొన్ని నగలు, వెండి సామాను కొంచెం ఉన్నాయి. ఇంక చూడలేదు అవి ఉన్నాయో లేదో."

"శేషాద్రీ బీరువా మీద ఫింగర్ ప్రింట్స్ కలెక్ట్ చేశావా, కత్తిమీద ఇంకెక్కడ దొరికితే అక్కడ తీసుకో. బీరువా పనయిందా" అడిగాడు ఫింగర్‌ప్రింట్ అతన్ని.

"బీరువా అయింది చూడొచ్చుసార్" అన్నాడు శేషాద్రి.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో, "బీరువా తెరిచి ఏమన్నా పోయాయేమో చూడండి" అన్నాడు.

సుధాకర్ లాకర్ తెరిచి, బట్టల మధ్య వెతికి, "సరోజది నెక్లెస్ సెట్, ఒకటి రెండు ఉంగరాలు, క్యాష్ 2, 3 వేలుండాలి సార్ అదీ లేదు" అంటూ వెతికి, 'ఖరీదైన కెమెరా ఫారెన్‌ది - అదీ లేదు సార్" అన్నాడు.

"అంటే, అంతా కలిపి అరవై డెబ్బైవేల పైమాటే గదా" ఇన్‌స్పెక్టర్ అన్నారు.

"అనుకుంటానండి."

"అంటే ఇది డబ్బుకోసం చేసిన హత్య అయి ఉంటుందా? ఇంతకీ ఇది దొంగతనం కోసమే అయితే దొంగలు ప్రవేశించే అవకాశాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?"

"కేవలం వీధి గుమ్మం నించి తప్ప మిగతా బాల్కనీల్లో అక్కడ గ్రిల్స్ ఉన్నాయండి. అక్కడెక్కడనించి ఎవరూ వచ్చే వీలులేదు" సుధాకర్ అన్నాడు.

తలుపు పరీక్షించి, "తలుపు బలవంతంగా తీసిన గుర్తులు లేవు. అంటే మీ ఆవిడ తీసి ఉండాలి - ఎవరన్నా బెల్ కొడితే తీసి ఉంటారా - తెలిసినవారు పిలిస్తే తీసి వుండొచ్చా."

సుధాకర్ అయోమయంగా చూస్తూ, "నాకెలా తెలుస్తుందండి. అసలు ఏ టైములో

ఈ హత్య జరిగిందో... అర్ధరాత్రి ఎవరన్నా పిలిచినా తలుపు అంత వెంటనే తీస్తుందా - తెలిసిన గొంతు అయితే తప్ప..." గొణిగినట్లన్నాడు.

"ఊ, అదీ కరెక్టే. శవాన్ని పోస్టుమార్టమ్ చేస్తే తప్ప టైము సరిగ్గా తెలియదు. టైముని బట్టి ఆలోచించాలి. డబ్బు తప్ప ఇంకేదన్నా మోటివ్ వుందా అని కూడా ఆలోచించాలి. చూడండి సార్. మీ ఆవిడకి తెలిసి వారు, స్నేహితులు, బంధువులు ఎవరన్న రాత్రివేళ వచ్చే అవకాశం ఉందా."

తల అడ్డంగా ఊపాడు సుధాకర్.

"ఆవిడ బంధువులు ఎవరూ లేరండి. స్నేహితులున్నారేమో. ఆఫీసులో కొలీగ్స్ వాళ్ళు నాకు తెలిసినంతవరకు అంత చనువుగా రాత్రి యింటికి వచ్చేవారు లేరను కుంటున్నాను."

"సరే, మీరు స్టేషన్‌కి వచ్చి రిపోర్టు రాసిచ్చి, సంతకం చేయండి. బాడీ పోస్టు మార్టమ్ అయ్యాక అప్పగిస్తాము. ఈలోగా మీకేదన్నా అనుమానం, ఆచూకీ, క్లూ లాంటివి ఏమన్నా దొరికితే చెప్పండి. ఆ వన్‌మినిట్, మీరు మొన్న రాత్రి ఊరెళ్లా మన్నారు. ఏ వూరు?

"విజయవాడండి."

"నిన్నంత విజయవాడలోనే ఉన్నారా?" సందేహంగా చూస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్.

సుధాకర్ బెరుకుగా చూస్తూ తనని అనుమానిస్తున్నాడా అన్న భయంతో, "నిన్నంతా విజయవాడలోనే వుండి రాత్రి ట్రైను పట్టుకుని వచ్చానండి" అన్నాడు.

"మీరు అక్కడ ఉన్నట్టు ఋజువు చేయగలరా, ఎవరన్నా సాక్ష్యం చెప్పగలరా - సారీ, మా పోలీసులు అన్ని వైపుల నుంచి ఆలోచించాలి. దోషి దొరికే వరకు అందరినీ అనుమానించడం మాకు తప్పదు. అందుకని అడుగుతున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

సుధాకర్ తేలికగా నిట్టూర్చి, "దాందేముందండి. నేను అక్కడ ఉన్నట్టు ఎవరైనా చెపుతారు. ఇద్దరు ముగ్గురు మెడికల్ షాపువాళ్లని, ఒక డాక్టరు పెద్ద ఆర్డరు ఇస్తానంటే కలవడానికి వెళ్ళాను. దురదృష్టవశాత్తు ఆయన అర్జంటుగా ఊరికి వెళ్లారు. సాయంత్రానికి వస్తే కలవచ్చు అన్నారు ఇంట్లో వారు - మెడికల్ షాపు వారిని అడగండి నేనెప్పుడూ వెళ్లే లాడ్జి వారిని అడగండి".

"లాడ్జిలో ఎప్పటి వరకు ఉన్నారు. మెడికల్ షాపులకెప్పుడు వెళ్లారు? ఆ తర్వాత ఇంకేం చేశారు?"

"ఉదయం దిగి లాడ్జి కెళ్లి స్నానం చేసి, టిఫిన్ చేసి కాసేపు రెస్టు తీసుకుని పది గంటలకి మెడికల్ షాపుల వారిని కలిశాను. డాక్టరుని కలవాలని ఫోను చేస్తే సాయంత్రానికి గాని రారనడంతో చేసేదేం లేక వంటిగంటకి భోంచేసి మాట్నీ సినిమా కెళ్ళాను. సాయంత్రానికి కూడా డాక్టరుగారు రాలేదు. అంచేత సినిమా చూసి కాసేపు యిటు అటు తిరిగి స్టేషను కెళ్లి అక్కడ భోంచేసి రాత్రి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ పట్టుకున్నాను. డాక్టరు సాయంత్రం కూడా రారని ముందే తెలిస్తే వెంటనే ఏదో ట్రైనో బస్సో పట్టుకు వచ్చేసేవాడిని. అలా వచ్చేసి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదేమో" – మళ్లీ కళ్ళు నిండాయి అతనికి.

"సారీ సర్, మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని కాదు – మాకివి రొటీన్ ప్రశ్నలు. సాయంత్రం వరకు మీరక్కడే వున్నారనడానికి రుజువు తెలిసినవారు, చూసిన వారు..." ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నాడు.

"సాయంత్రం సినిమా నించి వచ్చాక నేనింక ఎవరిని కలవలేదండి..." అంటూ ఆగిపోయి ఏదో గుర్తు వచ్చినట్టు పేంటు జేబులు వెతికి సినిమా టిక్కెట్లు పైకి తీశాడు సంతోషంగా. "ఓగాడ్, లక్కీగా ఇది జేబులో ఉండిపోయింది" అంటూ ఇచ్చాడు.

"యిదేమిటి, టిక్కెట్టు మొత్తం ఉంది?" ఇన్‌స్పెక్టరన్నాడు.

"అదా నేను వెళ్ళేసరికి సినిమా మొదలై పదినిమిషాలు అయింది. తలుపు దగ్గర ఎవరూ లేరు. సీటు వెతుక్కుని నేనే వెళ్లి కూర్చున్నాను. అడిగితే చూపిద్దాం అని జేబులో పెట్టుకున్నాను. ఎవరూ వచ్చి అడగనే లేదు."

"ఐసీ! ఏం సినిమా అన్నారు?" అంటూ పేరు చూసి, టిక్కెట్టు తన జేబులో పెట్టుకుంటూ, "ఇది నా దగ్గర వుండనీయండి. అన్నట్టు రైలు టిక్కెట్టు కూడా వుందా?"

"వుందండి. టిక్కెట్టు ఎప్పుడూ నేను గేటు దగ్గర చూపించి ఉంచుకుంటాను. నేను టి.ఏ. బిల్లు సబ్‌మిట్ చేయాలి గదా."

"సరే మరో ప్రశ్న. ఈ కత్తి మీ ఇంట్లోదా... చెప్పగలరా?"

"ఉందండి" అంటూ వంటింట్లోకి వెళ్లి వచ్చి, "మాదానిలాగే ఉందండి. మా

దగ్గిర ఈ కత్తుల సెట్ వుందండి. ఐదు రక రకాలు - తరగడానికి సైజుల వారిగా సెట్ వుంది. మా ఆవిడెవరో సేల్స్‌మెన్ ఇంటి కొస్తే కొంది. అదే ఇది అనుకుంటు న్నాను" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్, "సర్, స్టేషన్‌కి రండి రిపోర్టు రాసిద్దురుగాని..." అన్నాడు.

"బాడీ... ఎప్పుడిస్తారండి" పక్కింటి సుబ్రహ్మణ్యం అడిగాడు.

"పోస్టుమార్టం అవాలిగదా. ఈలోగా మీ బంధువులందరికీ తెలుపుకోండి. కనీసం పన్నెండు వంటి గంట అవచ్చు. పోస్టుమార్టం చేసే డాక్టరు, స్టాఫ్ రావాలి కదా"

సుధాకరమూర్తి, ప్రదీప్ పోలీస్‌స్టేషన్‌కెళ్లి రిపోర్టు ఇచ్చి వచ్చారు. శవాన్ని పోస్టుమార్టమ్‌కి ప్రభుత్వాసుపత్రికి తీసికెళ్ళారు. ఊర్లో ఉన్న సుధాకర్‌మూర్తి అక్క బావ, వచ్చారు కబురు తెలిసి. స్నేహితులు, సరోజ ఆఫీస్ స్టాఫ్ కబురు తెలిసి ఒక్కొక్కరే వచ్చారు. బాడి వంటి గంటకి ఇంటికి తీసుకొచ్చారు. సరోజ తల్లిదండ్రులు మర్నాడు పది గంటలకి గాని రాలేరు. అంచేత బాడీ అంతసేపు ఉంచడమా సాయంత్రం లోగా దహన సంస్కారం జరపడమా అన్న తర్జన భర్జనల తరువాత రాత్రి ఎప్పుడో పోయిన శవాన్ని ఇంకా ఉంచడం అనవసరం అని అంతా తీర్మానం చేసి ఐదుగంటలకల్లా శవాన్ని తీసికెళ్లి దహన సంస్కారాలు జరిపించారు.

* * * * * *

సరోజ పోయి అప్పటికి వారం అయింది. హత్య జరగడానికి కేవలం డబ్బు, నగలు దోచుకోవడానికి అంటే నమ్మబుద్ధి కావడంలేదు ఇన్‌స్పెక్టర్‌కి. ఎంచేత అంటే సుధాకర్ ఊరికి వెళ్లాడని, సరోజ వక్కర్తే ఉందని దొంగలకి తెలుసా? ఎవరన్నా తెలిసినవారు చేసారా? చేయడానికి కారణాలు, మోటివ్ ఏమిటి? అసలు హత్య చేసిన వారు ఎవరు? ఎలా లోపలకు వచ్చారు? ఏ మామూలు దొంగలో అయితే ఇరవై నాలుగు ఫ్లాట్స్ వుంటే, ఈ ఇంట్లోకే దూరి కాస్తపాటి నగలు, డబ్బు కోసం హత్యచేశారా? లోపలికి ఎలా రాగలిగారు? - సరోజ తలుపు తీసిందా? - అర్ధరాత్రి ఎవరో తెలియకుండా అంత సులువుగా తలుపెందుకు తీసింది? పోస్టుమార్టమ్ ప్రకారం హత్య పన్నెండు తరువాత వంటి గంటన్నర లోపల జరిగి ఉండవచ్చుని వచ్చింది. సరోజకి ఎవరో తెలిసిన వారా? రెండు తాళాలలో సుధాకర్ దగ్గిర ఒక తాళం ఉంది. భార్యని హత్యచేసే కారణం ఏమిటి అతనికి? ముందురోజు సాయంత్రం 6 గంటల వరకు విజయవాడలో ఉన్నట్టు మ్యాట్నీకి వెళ్ళినట్లు, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్

రాత్రి తొమ్మిదిన్నరకి ఎక్కినట్టు టిక్కెట్టు చూపిస్తుంది. అసలు అతను చేసాడనడానికి మోటివ్ ఏమిటి? భార్య మీద ఏదన్నా అనుమానమా? భార్యకి ఇంకొకరితో ఎవరితో నన్నా అక్రమ సంబంధం ఉందని ఇతనికి తెలిసిందా? లేక, ఇతనికేమన్నా వివాహేతర సంబంధాలుండి భార్యని వదిలించుకోవడానికి ప్లాన్ వేశాడా? అతని మొహం, మాటలు చూస్తే అలా అనుమానించదగ్గ ఆధారాలు కనపడలేదే? రకరకాల ఆలోచనలు వచ్చాయి. ఏ ఒక్కదానికి సరి అయిన ఆధారాలు, లింకు అతనికి దొరకడం లేదు.

సరోజ హత్య జరిగిన మర్నాడు ఇన్స్పెక్టరు సునీల్‌వర్మ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ని రకరకాలుగా ప్రశ్నించాడు. అతని మాటలవల్ల తెలిసిన విషయాల బట్టి అపార్ట్‌మెంట్‌లో నీళ్ళ ప్రాబ్లమ్ వుండడం వల్ల రోజూ రాత్రి పన్నెండు వంటిగంట మధ్య తప్పకుండా వాటర్ టాంకర్ వస్తుంది. అవసరమైతే రెండు వస్తాయి. అర్ధరాత్రి – ఆ టైములో వాచ్‌మెన్ వెనుక పక్క గేటు తెరిచి టాంకరుని లోపలికి రానిచ్చి నీళ్లు సంప్‌లోకి పోయిస్తాడు. అపుడు మెయిన్ గేట్‌కి తాళం ఉంటుంది. పన్నెండు పన్నెండున్నరకి సినిమాల నించి, క్లబ్బుల నించి వచ్చేవాళ్లు వచ్చాక కార్లు వచ్చే గేటు తాళం పెట్టి, మనుషులు నడిచే చిన్న గేటు తీసి వుంచుతాడు, ఎవరన్నా రావడానికి వీలుగా, టాంకరు వచ్చి వెళ్ళాక రెండు గంటల ప్రాంతంలో చిన్న గేటూ తాళం పెట్టి గేటు ముందే పక్క పరుచుకుని నడుం వాలుస్తాడు. తర్వాత ఎవరన్నా వస్తే అడిగి, చూసి తాళం తీస్తాడు. అదీ అక్కడ రొటీన్. అంటే వాచ్‌మెన్ తాళాలు ఎప్పుడు వేసేది, టాంకరు ఎప్పుడు వచ్చేది తెలిసిన వారే, టాంకరు వచ్చిన సమయంలో చిన్నగేటు లోంచి వచ్చారా? వచ్చి హత్యచేసి అలాగే వెళ్ళారా? నీళ్లు సంప్‌లోకి వదిలి తాళం వేసి, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో ఎక్కించడానికి మోటార్ వేసి రావడానికి ఎంత లేదన్నా అరగంట పడుతుంది కనుక ఆ అరగంటలో హత్య జరిగి వుండచ్చు. అంటే ఈ రొటీనంతా తెలిసిన వాళ్ళు చేసిన పనా? ఆ తెలిసినవాడెవరు? వాచ్‌మెన్‌ని అతని అక్క బావల్ని అపార్ట్‌మెంట్ యిరుగుపొరుగుల్ని సుధాకర్, సరోజల దాంపత్య జీవితం గురించి, వారి ప్రవర్తన, రాకపోకలు గురించి, రకరకాలుగా ప్రశ్నించినా పెద్దగా ఏ విషయమూ రాబట్టలేకపోయాడు ఇన్స్పెక్టర్. ఇద్దరు ఉద్యోగస్థులవడం వల్ల ఏ ఆదివారమో తప్ప, రాత్రిళ్ళు తప్ప ఇంట్లో వుండేది తక్కువ కనుక పెద్దగా వారి విషయాలు తెలియవన్నట్టే అంతా చెప్పారు. ఎప్పుడో ఊర్లో ఉండే అతని అక్క బావ, ఎప్పుడైనా అతని స్నేహితులు ఫామిలీతో వచ్చేవారు

ఎక్కువ రాకపోకలు లేవన్నారు. ఇద్దరి మధ్య మామూలుగా భార్యాభర్తలు ఎప్పుడన్నా తగవులు పడడం సహజంగా జరిగేదే. అలా మాట అనుకున్నా తాము వినలేదన్నారు. ఇద్దరూ పెళ్ళయిన కొత్తలో ఎప్పుడన్నా సినిమాకి, షికారుకి, హోటళ్లకి స్కూటర్ మీద వెళ్ళడం చూసేవారని, ఈ మధ్య అలా వెళ్ళడం చూడలేదని చెప్పారు. సుధాకర్ ఇల్లు సోదా చేసినా ఏ క్లూలు దొరకలేదు. పరిశోధన అరంగుళం ముందుకు జరగలేదు. అసలు సుధాకర్ విజయవాడ వెళ్లినట్లు - చెపుతున్నది నిజమేనా? తను వెళ్లకుండా ఇక్కడే వుండి ఈ నాటకం ఆడాడా? - అలా అయితే అతని దగ్గర మాట్నీ టిక్కెట్టు వుందే! రైలు టిక్కెట్టు పోనీ రిటర్న్ జర్నీ టిక్కెట్టు అనుకుంటే సినిమా టిక్కెట్టు సంగతేంటి. ఆ లాడ్జి, మెడికల్ షాపువారిని వాకబు చేస్తే ఏమన్నా సంగతులు తెలుస్తాయా - ఓసారి విజయవాడ వెళ్లివస్తే - ఇన్‌స్పెక్టరు సునిల్‌వర్మకి విజయవాడ వెళ్ళివస్తే కేసులో ఏదన్నా పురోగతి లభిస్తుందేమోనన్న ఆశ వుంది.

* * * * * *

విజయవాడలో అతను దిగిన లాడ్జికి ముందు వెళ్లాడు. సుధాకర్ శుక్రవారం ఉదయం వచ్చి వంటి గంటకి లాడ్జి ఖాళీ చేసినట్టు చెప్పారు. అతను రాత్రి 10 గంటలకి కదా ట్రైను వంటిగంటకి ఎందుకు ఖాళీ చేశాడు? ఇన్‌స్పెక్టరు ఆశ్చర్యంగా అడిగాడు.

"మా చెకింగ్ టైము ఒంటిగంట సార్. రాత్రి వరకు ఉంటే మరో రోజు ఛార్జీలు ఇవ్వాలని ఒకరోజు పని వుండి వచ్చినప్పుడు ఆయనలా లంచ్ తిని చేతిలో చిన్న బ్రీఫ్‌కేస్ గనక చెకవుట్ చేసి సాయంత్రం పని చూసుకు దొరికిన ట్రైనుకి వెళ్ళిపోతుంటారు సార్. అతని అలవాటు పాతదే" అని చెప్పారు.

మెడికల్ షాపు వారిని కలిస్తే వాళ్ళూ సుధాకర్ పదకొండు గంటలకి వచ్చినట్టు కన్‌ఫర్మ్ చేశారు. సుధాకర్ కలుసుకోవాలనుకున్న డాక్టరు ఊళ్ళో లేకపోవడం, సాయంత్రానికి రాకపోవడమూ నిజమే అయింది. ఇంక మిగిలింది సినిమా హాలుకెళ్లి ఆరా తీయడం - మేనేజర్ని కలుసుకుని తన దగ్గిరున్న మాట్నీ టిక్కెట్లు చూపించి ఎవరన్నా సినిమా మధ్యలో వెళ్ళిపోయారా శుక్రవారం మ్యాట్నీలో, మీ గేట్‌కీపర్లని అడగగలరా అంటూ చెప్పబోతూంటే మేనేజర్ చేతిలో టిక్కెట్టు చూసి, "ఇది గురువారం మాట్నా టిక్కెట్ సార్, శుక్రవారంది కాదు" అన్నాడు.

ఇన్‌స్పెక్టరు తెల్లబోయాడు. అంతవరకు టిక్కెట్టు సరిగా చూడనందుకు తిట్టుకున్నాడు.

"ఐసీ, ఇది గురువారందా, శుక్రవారం కూడా ఇదే సినిమా ఆడిందా..." ఆరా తీశాడు.

"లేదు సార్. మా థియేటర్లో ప్రతి శుక్రవారం మారిపోతుంది. ఈ సినిమా గురువారంతో అయిపోయింది" అన్నాడు.

సునిల్‌వర్మ కళ్ళు మెరిశాయి. చిన్ని క్లూ దొరికినందుకు సంతోషించాడు. ఆలోచనలో పడి సంఘటనలు మనసులో పేర్చసాగాడు.

* * * * * *

"మిస్టర్ సుధాకర్ చిన్న ప్రశ్న. శుక్రవారం విజయవాడలో మీరేం సినిమా చూసామన్నారు మాట్నీకి వెళ్ళి" సునీల్‌వర్మ క్యాజువల్‌గా అడిగినట్టు అన్నాడు.

ఇన్‌స్పెక్టరు హైదరాబాదు తిరిగి వచ్చిన మూడు నాలుగు రోజులు సరోజ పనిచేసే ఆఫీసులో ప్యూను మొదలు, మేనేజరు వరకు అందరిని రకరకాల ప్రశ్నలు అడిగాడు. ఆఫీసులో, ఆమె డెస్క్ డ్రాయరు కీ తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించాడు. అందులో దొరికిన ఒక డైరీ స్వాధీనం చేసుకుని ఇంటికెళ్ళి రాత్రంతా చదివి చాలా విషయాలు అర్థం చేసుకున్నాడు. అందులో దొరికిన రెండు మూడు ఫోటోలలో వ్యక్తిని గుర్చి ఆఫీసువారిని వాకబు చేసుకుని రూఢి చేసుకున్నాక అతన్ని కలుసుకు మాట్లాడాక చాలా వరకు అతనికి కథ అర్థం అయింది. సుధాకర్ ఇంటికెళ్ళి యింటరాగేషన్ మొదలుపెడుతూ మొదటి ప్రశ్న వేశాడు.

సుధాకర్ కాస్త బెరుకుగా చూసి, "అల్లరి రాముడు" అన్నాడు. ఎందుకడిగాడా అనుకుంటూ.

"ఐసీ, ఆ సినిమాలో రెండు మూడు సీన్లు చెప్పగలరా?"

"మరింత తెల్లపోతూ, "ఎందుకుసార్, అలా అడుగుతున్నారు" అన్నాడు భయంగా.

"ఊరికే. మీరు సినిమా చూసినట్టు రుజువుకోసం, రొటీన్ ప్రశ్న" - అన్నాడు తేలిగ్గా.

సుధాకర్ గుర్తు తెచ్చుకుని రెండు మూడు సీన్లు చెప్పాడు.

"టి.వి.లో అడ్వర్టైజ్‌మెంట్‌లో పదేపదే దంచుతున్నారు ఈ సీన్లు. అవి గుర్తు పెట్టుకున్నారా, లేక ఇంతకుముందే చూశారా" - కాస్త వ్యంగ్యంగా అడిగాడు ఇన్‌స్పెక్టరు.

సుధాకర్ కలవరపడి, "సార్ అదేమిటి?" అన్నాడు.

"ఎందుకడిగానంటే శుక్రవారం ఆ థియేటర్లో ఆ సినిమా లేదు గదా - ఎలా చూసారోనని సందేహం వచ్చి అడిగాను" - కూల్‌గా అన్నాడు.

సుధాకర్ తెల్లపోయాడు.

"ఇంతకీ మీరు ఈ టిక్కెట్టు కౌంటర్లోనే కొన్నారా?"

సుధాకర్ నుదుటి చెమట తుడుచుకుంటూ, "కాదు సార్, నేను రెండు గంటల కెళ్ళేసరికి టిక్కెట్లు అయిపోయాయని కౌంటరు మూసేసారు. గేటుదగ్గర ఎవరో బ్లాక్‌లో అమ్ముతుంటే..."

"అదీ సంగతి, అక్కడే పప్పులో కాలేశారు మీరు. ఆ బ్లాక్‌లో అమ్మేవాడు మీకు టోపి పెట్టి క్రితం రోజు మిగిలిన టిక్కెట్టు అమ్మాడు."

"నిజమా సార్, అందుకే ఆ వెధవ దొంగచూపులు చూస్తూ డబ్బివ్వగానే గబగబ మాయం అయిపోయాడు" - ఏదో ఇంకా చెప్పబోతూ ఇన్‌స్పెక్టరు మొహం చూసి ఆగిపోయాడు.

"అంతే, గురువారం టిక్కెట్టుతో థియేటర్లోని సినిమా శుక్రవారం చూసారన్న మాట' . మిస్టర్ సుధాకర్ ఈ చిన్న స్లిప్ ఇచ్చి దొరికిపోయావు నీవు. హడావుడిలో టిక్కెట్టు సాక్ష్యానికి వుండాలనుకున్నావు కాని కౌంటరు మూసేయగానే దిగాలుపడి, బ్లాక్ టిక్కెట్టు అమ్మేవాడు కనపడగానే ప్రాణం లేచివచ్చినట్టు వాడేం టిక్కెట్టు ఇచ్చాడో చూసుకోకుండా జేబులో పెట్టేసుకున్నావు. సినిమా చూసే ఉద్దేశం లేదు కనుక థియేటర్‌లోకి వెళ్ళకుండా రైలుస్టేషన్‌కి వెళ్ళిపోయి హైదరాబాద్ వెళ్ళే మొదటి ట్రైను కనపడగానే 3.30కి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఎక్కేశావు. ఏమ్ ఐ కరెక్ట్?" వ్యంగ్యంగా అన్నాడు.

సుధాకర్ మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్క లేనట్టు తెల్లపడిపోయింది. గాభరాపడి ఏదో చెప్పబోయాడు.

ఇన్‌స్పెక్టరు చేత్తో వారిస్తూ, "ఇంకేం బుకాయింపు వద్దు... ఈ చిన్న ఆధారంతో నేను అంతా ఊహించాను. ఉత్త ఊహే కాదు మీ ఆవిడ ఆఫీసు కెళ్ళి అందరితో మాట్లాడి, ఆవిడ డైరీ స్వాధీనం చేసుకున్నాను. అందులో దొరికిన ఫోటోలు, డైరీ సాక్ష్యం చాలు కథంతా తెలియడానికి. నీ భార్యని నీవు చాలా తెలివిగా ప్లాన్ చేసి

హత్య చేశావు. ఆ కథంతా నిజం ఒప్పుకుంటూ నీవే చెప్తావా, నన్ను చెప్పమన్నావా" ఇన్‌స్పెక్టర్ కఠినంగా అన్నాడు.

సుధాకర్ కుర్చీలో కూలబడి మొహం చేతులతో కప్పుకున్నాడు. మనిషి నిలువెల్ల వణికిపోతున్నాడు.

"కమాన్ టెల్‌మి - ఎందుకు చేశావు ఇలా? ఇష్టం లేకపోతే నీ భార్య మోసం చేసిందనుకుంటే డైవోర్స్ ఇవ్వాల్సింది. హత్యచేస్తే నీకు శిక్ష పడ్తుందని తెలీదా? లేక చాలా తెలివిగా చేసి తప్పించుకోగలననుకున్నావా? - జరిగిందంతా చెప్పి నేరం ఒప్పుకో" కఠినంగా అన్నాడు.

సుధాకర్ మొహం ఎర్రబడింది. కోపంతో ఊగిపోతూ, "అవును, చంపాను. నేనే చంపాను, నన్ను మోసం చేసి ఇంకొకడితో కులుకుతుంటే తట్టుకోలేక నేనే కసికొద్ది చంపాను. నన్ను పెళ్ళాడి నా జీవితం నాశనం చేసిందాన్ని."

"నీకు నీ భార్యమీద అనుమానం ఎందుకు వచ్చిందసలు? ఎప్పుడు కనిపెట్టావు ఇంకొకరితో సంబంధం ఉందని? చెప్పు - ఇంక దాచి లాభం లేదు. ముందునుంచి నాకెందుకో ఈ హత్య కేవలం నగలు డబ్బు కోసం అంటే నమ్మలేకపోయాను. కానీ నీవు చాలా పకడ్బందీగా ప్లాన్ చేశావు. ఈ ఊరిలో లేనట్టు, విజయవాడలో ఉన్నట్లు నమ్మించడంతో బోల్తా పడ్డాను. కానీ ఎక్కడో లింకు అందలేదన్నది తడ్తూనే ఉంది నాకు. ఈ అపార్టుమెంట్ వ్యవహారం, నీళ్ళ టాంకరు వచ్చే సమయం, వాచ్‌మెన్ గేట్ వేసే టైము ఇవన్నీ క్షుణ్ణంగా తెలిసిన ఎవరో టైము చూసుకుని చేశారు. ఆ ఎవరు? బయటివాళ్ళా, కాంప్లెక్స్ వాళ్ళా - అసలు హత్యకు మోటివ్ ఏమిటి అన్నది అంతుబట్టలేదు. ఎప్పుడూ నేరస్థుడు చిన్న పొరపాటు ఎక్కడో చేసి తప్పటడుగు వేస్తాడన్నది నిజం. ఆ నిజం ఇప్పుడూ నిజమయింది. నీ ఖర్మకాలి ఆ టిక్కెట్టు తారీఖు చూసుకోకుండా కొనడం, థియేటర్లో ఏ సినిమా ఆడుతున్నది సరిగా చూడకుండా హడావిడిలో పొరపాటు చేసి దొరికిపోయావు. చెప్పు నీ భార్యమీద నీకు అనుమానం ఎప్పుడొచ్చింది? ఎలా తెలిసింది - ఆమెకు ఇంకొకరితో సంబంధం ఉందని?"

"ఇన్‌స్పెక్టర్ ఓభర్తకి తన భార్య ఇంకోరితో సంబంధం పెట్టుకుందని తెలిస్తే ఎవరూ భరించలేరు సార్. మొదటిసారి, అంటే పెళ్ళయిన ఏడెనిమిది నెలలకి ఓసారి ఇలాగే పనిమీద ఏదో ఊరు వెళ్ళి పొరపాటున ఇంటి తాళాలు తీసికెళ్ళడం

మర్చిపోయి తాళాల కోసం ఆఫీసుకెళ్ళాను – అక్కడావిడ లేదు. ఆఫీసు లీవు పెట్టి పన్నెండుగంటలకే వెళ్ళిందన్నారు. రెండయినా ఇంటికి రాలేదంటే ఎక్కడికి వెళ్ళింది? ప్యూన్‌ని అడిగితే 'ఎవరో సార్ వచ్చారు. ఇద్దరూ కలిసి వెళ్ళా'రన్నాడు. నేను ఊరినుంచి మర్నాడు కాని రానని తెలుసు కనుక ఇంటికి ఎప్పుడు వస్తుందో చూద్దాం, ఆ వ్యక్తి ఎవరో చూడాలని అపార్ట్‌మెంట్‌కి కాస్త దూరంలో కాపు వేశాను. సాయంత్రం అయిదవుతుండగా ఎవరో అతనితో స్కూటర్ మీద వచ్చి సందు మొదట్లో దిగి ఇంటికి వెళ్ళింది. ఆవిడ వెళ్ళిన వెంటనే నేను వెళ్ళేను. నన్ను చూసి బిత్తరపోయింది. తను ఎవరితోనో రావడం, నేను ఆఫీసుకి వెళ్ళడం అంతా చెప్పి నిలేశాను. ముందు ఎవరో స్నేహితుడని బుకాయించింది. క్లాస్‌మేట్ కనిపిస్తే బయటికి వెళ్ళానని... నమ్మినట్టు నటించాను. ఆ తరువాత మూడు నాలుగు నెలలు ఆమెని గమనించడమే పని అయింది. రెండు మూడుసార్లు స్పష్టంగా అతనితో సినిమాలకి, హోటలుకి వెళ్ళడం రూఢి అయ్యాక నిలేస్తే ఇంక లాభం లేదని నిజం వప్పుకుంది. అతను పెళ్ళికి ముందు తన క్లాస్‌మేట్ అని, స్నేహితుడని ఇద్దరి మధ్యా ఇదివరకే పరిచయం, ప్రేమ ఉన్నా అప్పటికి అతని చదువు పూర్తి అవ్వక, ఉద్యోగం దొరక్క అతన్ని చేసుకునే వీలు దొరకలేదని, అతనిపట్ల ఇంకా ప్రేమ వుందని, అతను కనిపించగానే ఇద్దరి మధ్య సన్నిహిత్యం పెరిగిందని, తమది నిజమైన ప్రేమని, నన్నెప్పుడూ ప్రేమించలేదని, కేవలం భర్తగా చూడడం తప్ప నా మీద తనకేం లేదని, విడాకులు ఇచ్చేయమని కోరింది నిజం వప్పుకుని. భరించలేకపోయాను. నా పరువు, గౌరవం ఏమవ్వాలి? నాతప్పు లేకుండా నన్ను విదిల్చి పారేయాలనుకోవడం నాలో విచక్షణా జ్ఞానాన్ని చంపేసింది. ఆమెపట్ల కసి, ద్వేషం పెరిగి నన్ను ఇంత మోసం చేసింది చాలక నిర్భయంగా నన్ను వదుల్చుకోవాలనుకోవడం భరించలేక నన్నుకాదని ఆమె సుఖపడకూడదని, పడనీయకూడదన్న కక్ష పెరిగి ఆమెని ఎలాగైనా శిక్షించి నాకు చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోవాలని, నెలా పదిహేనురోజులు రకరకాలుగా ప్లాన్లు వేసి ఆఖరికి ఈప్లాను నిర్ణయించాను. విజయవాడలో ఉన్నట్టు ఎలిబి చూపి, అక్కడ నించి మధ్యాహ్నం రైలులో రాత్రి తొమ్మిదిన్నరకి హైద్రాబాద్ వచ్చాను. పదకొండున్నర ప్రాంతంలో ఆటో ఎక్కి చలికాలం కనక నన్నెవరూ గుర్తుపట్టకుండా మంకీ క్యాప్, నల్ల స్వెట్టర్ తొడుక్కుని మా అపార్ట్‌మెంట్‌కి రెండు ఫర్లాంగుల దూరంలో ఆటో దిగాను. ఎవరన్నా ఆటోవాడిని పోలీసులు అడిగినా నా అపార్ట్‌మెంట్ దగ్గర దిగినట్టు ఎవరూ చెప్పకుండా అక్కడ దిగి, పన్నెండు గంటలకి నీళ్ళ టాంకరు

రావడం చూసాక నడుచుకుంటూ మా అపార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్ళి చిన్న గేటులోంచి వాచ్‌మెన్ వెనకపక్క నుండగా లిఫ్ట్ ఉపయోగించకుండా, ఎవరి కంటా పడకుండా, నా దగ్గిరున్న తాళంతో తలుపు తీసి లోపలికి వెళ్ళాను. సరోజ అపార్ట్‌మెంట్‌లో ఎవరికన్నా తెలుస్తుందనో, తెలిస్తే నాకు చెపుతారనో ఎప్పుడూ అతన్ని ఇంటికి తీసుకురాలేదు. తనే అతనితో వెళ్ళేది. నిద్రపోతున్న సరోజని చంపడానికి ముందే ఇంట్లో ఉన్న కత్తి పట్టుకుని వేలిముద్రలు పడకుండా గ్లౌస్ వేసుకుని పక్కకి తిరిగి పడుకున్న ఆమెని వెల్లకిలా తిప్పి కసిగా కడుపులో పొడిచాను. మేల్కొన్న సరోజ భయంతో కేకలు పెట్టబోతుంటే నోరు నొక్కాను. గింజుకుంటూ కిందపడితే అక్కడ గుండెల్లో మరో పోటు పొడిచేసరికి గిలగిల కొట్టుకుని కాసేపట్లో చనిపోయింది. అపుడు గబ గబ ఆమె వంటిని ఉన్న నగలు, బీరువా తెరిచి మిగతా డబ్బు, క్యాష్ వగైరాలు జేబులో వేసుకున్నాను. నగల కోసం దొంగతనం జరిగిందనుకుంటారు అందరూ అనుకున్నాను. తలుపు దగ్గరగా లాగి అరగంటలో చడీ చప్పుడు లేకుండా వచ్చిన దారినే దిగి వాచ్‌మెన్ మోటారు రూములో ఉండగా అపార్ట్‌మెంట్ నించి నడుస్తూ అరకిలోమీటరు నడిచి అక్కడ ఆటో ఎక్కి రైల్వే స్టేషన్‌కి వెళ్ళి, తెల్లారి సర్కారు ఎక్స్‌ప్రెస్ రాగానే ఆటోలో ఇంటికి వచ్చాను."

"కరెక్ట్, నీవు హత్య ఎలా చెశావో నేనూహించినట్టే చేశావు."

"సార్, మీకెందుకు నామీద అనుమానం వచ్చింది? ఎలా వచ్చింది? నిండా మునిగాను ఇంకా చలేమిటి, చెప్పండి సార్. ఇప్పుడు నాకేం ఇంక భయం వేయడం లేదు."

"హత్య జరిగి నెలరోజులైనా చిన్న క్లూ దొరకలేదా అని పై అధికారులు దబాయిస్తుంటే ఎన్నిరకాలుగా ఆలోచించినా మోటివ్ అర్థం కాకపోవడంతో ఓసారి విజయవాడ వెళ్ళి వద్దాం అని వెళ్లాను. మిగతాదంతా నీవు చెప్పినట్టే – మెడికల్ షాపు, డాక్టరు ఇంట్లో చెప్పారు. చిన్న పొరపాటు చేశావు. నిన్నటి టిక్కెట్టు మిగిలి పోయింది. నీకు బ్లాక్‌లో టిక్కెట్లమ్మేవాడు అంటగట్టడం వల్ల, అది నీవు గమనించక పోవడంవల్ల తీగ దొరికింది. డొంక లాగాను. మీ ఆవిడ నీకు తన సంగతి తెలిసిందని ఎలాగో తెలిసింది కనుక భయపడకుండా నిజం ఒప్పుకున్నదని, మీ ఇద్దరి మధ్య జరిగిన దెబ్బలాటలు, ఆమె నిన్ను డైవోర్సు అడిగిన వైనం రాసుకుంది. అప్పుడు కథ అర్థం అయింది. ఆ అపార్టుమెంటు గేటు వేసే టైమింగు, టాంకర్ టైము

తెలిసిన నీవు తప్ప ఇంకెవరూ చెయ్యలేదని పట్టించింది నేరం. క్షణికోద్రేకంలో చేసిన నేరం కాదిది. ఆలోచించి, ప్లాన్ వేసి చేసిన మర్డర్ ఇది. సుధాకర్ నీవు నేరం అంగీకరించినా, కోర్టు నీకు తక్కువ శిక్ష విధించదు. బి మెంటల్లీ ప్రిపేర్డ్ ఫర్ ఇట్" - సుధాకర్‌ని కాస్త జాలిగా చూసాడు ఇన్‌స్పెక్టర్.

సుధాకర్ తల దించుకున్నాడు.

"నెల రోజులయినా కేసులో మీరు, పురోగతి సాధించలేకపోయేసరికి విజయం సాధించాననుకున్నాను. కానీ చట్టం దృష్టి నించి ఏ నేరస్థుడూ తప్పించుకోలేడని మరో సారి నా కథ రుజువు చేసింది. ఇప్పుడు నేను అన్నింటికి అతీతుడ్ని. చావంటే నాకు భయం లేదు" అంటూ చేతులు చాపాడు సుధాకర్.

(రచన, ఇంటింటి పత్రిక, జనవరి 2006)